# ప్రభాత సూర్యుడు
తెలుగు దినపత్రిక

## తెలంగాణలో ఓటర్ల సంఖ్య 3.17 కోట్లు

### కేంద్ర ఎన్నికల చీఫ్ కమిషనర్ రాజీవ్ కుమార్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



హైదరాబాద్ మినీ భారత్ లాంటిదని కేంద్ర ఎన్నికల చీఫ్ కమిషనర్ రాజీవ్ కుమార్ అన్నారు. గురువారం అయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణాలో 2022-23 లో 22 లక్షల ఓట్లను తొలగించాం. వందేళ్లు దాటిన ఓటర్లు 7,600. ఫామ్ అందిన తర్వాతే ఓట్లను తొలగించాం.

మిగతా 2లో...

RANGAREDDY, EDITION : 01, VOLUME :142 EDITOR:CHERUKU UPENDAR, DATE : FRIDAY 06 OCTOBER 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 142 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : శుక్రవారం 6 అక్టోబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-

## భారత్‌కు మరో రెండు బంగారు పతకాలు

### క్వార్టర్స్‌లోనే వెనుతిరిగిన పీవీ సింధు



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు : ఆసియా క్రీడల్లో భారత్‌కు మరో రెండు స్వర్ణం లభించింది. మహిళల టీమ్ కాంపౌండ్ విభాగంలో జ్యోతి సురేఖ వెన్నమ్, అదితి గోపిచంద్, పర్ణీత్ కౌర్‌తో కూడిన జట్టు ఫైనల్‌లో చైనీస్ తైపీపై 230-280 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. కాగా స్క్వాష్ మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్‌లో ఇండియన్ జోడి పాల్ సంధు, దీపికా పల్లికల్ గోల్డ్ మెడల్ గెలుచుకున్నది. దీంతో భారత్ ఖాతాలో 82 పతకాలు చేరాయి. ఇందులో 19 స్వర్ణాలు, 31 కాంస్యాలు, 32 రజత పతకాలు ఉన్నాయి. కాగా, ఆర్చరీలో భారత్‌కు ఇది రెండో బంగారు పతకం.
అంతకుముందు మిక్స్‌డ్ టీమ్ కాంపౌండ్ ఫైనల్‌లో ఓజాస్ డియోటల్, జ్యోతి సురేఖ

మిగతా 2లో...

### 2040 నాటికల్లా చంద్రునిపై

## ఇళ్ల నిర్మాణాలను చేపట్టనున్న నాసా!

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు




భారత్‌తో పాటు మరికొన్ని దేశాల్లోని అంతరిక్ష పరిశోధన సంస్థలు ఇప్పటికే చంద్రునిపై పలు అధ్యయనాలు జరిపాయి. మానవ జీవనానికి అనువైన వాతావరణం అక్కడ ఉందా? లేదా? అనే విషయంపై ఇంకా పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. అయితే.. అమెరికన్ అంతరిక్ష సంస్థ నాసా మాత్రం ఒక అడుగు ముందుకేసి, అక్కడ మానవుల కోసం గృహాలను నిర్మించాలని ప్రణాళికలు రచిస్తోంది. అవును..

మిగతా 2లో...

### హ్యాట్రిక్ రచనల్లో

## కేటీఆర్-హరీష్



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీఆర్‌ఎస్ గేర్ మార్చేసింది. ప్రగతి భవన్ వేదికగా గులాబీ బాస్ వ్యూహాలు రచించే పనిలో ఉండగా?రథ సారథులుగా మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు దూసుకెళ్తున్నారు. ఇప్పటికే ఎన్నికల ప్రచారాన్ని షురూ చేసేశారు. మరికొద్దిరోజుల్లో అధికారికంగా అసెంబ్లీ ఎన్నికల యుద్ధం మొదలుకాబోతుంది. ఇప్పటికే ప్రధాన పార్టీలు... వ్యూహాలు, ప్రతివ్యూహాలను సిద్ధం చేస్తున్నాయి. పోటీలో నిలిచి గెలిచే వారి జాబితాను కూడా రెడీ చేసుకునే పనిలో పడ్డాయి. కీలకమైన స్థానాల విషయంపై కూడా మేథోమథనం చేస్తున్నాయి. ప్రత్యర్థిని ఢీకొట్టే దిశగా అడుగులు వేస్తున్నాయి. ఎన్నికల యుద్ధం కోసం ఇప్పటికే 115 మంది అభ్యర్థులను ప్రకటించి? టాప్ గేర్ వేసేసింది గులాబీ పార్టీ. ఓవైపు అసంతృప్తులను లైన్ లోకి తీసుకొచ్చే పనిలో ఉండగానే? మరోవైపు ప్రచారాన్ని షురూ చేసేసింది.మూడో సారి హ్యాట్రిక్ కొట్టే దిశగా బీఆర్‌ఎస్ అడుగులు వేస్తోంది. ఇప్పటికే ఆ పార్టీ అధినేత
కేసీఆర్? వ్యూహ రచనలో బిజీగా ఉన్నారు.

మిగతా 2లో...

# మజ్లీస్ మాస్టర్ ప్లాన్

- మజ్లిస్‌కు పాతబస్తీలో పట్టు
- కావలసింది పదవులు కాదు పవర్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు




తెలంగాణలో ఎన్నికల షెడ్యూల్ రేపో మాపో రాబోతోంది. ఈసారి తెలంగాణ గడ్డపై గద్దెనెక్కేదెవరు అన్న ఆసక్తి రాజకీయాల్లో తారాస్థాయికి చేరుతోంది. మళ్లీ మేమే అని బీఆర్ఎస్, ఈసారి మా వంతు అని కాంగ్రెస్సు.... మేం లేమా అని బీజేపీ కలబడుతున్నాయి. తెలంగాణలో ఏ పార్టీ గెలిచినా అధికారంలో కూర్చోబెట్టేది మాత్రం తామేనని మజ్లిస్ గట్టి నమ్మకంతో చెబుతోంది. మజ్లిస్‌కు పాతబస్తీలో పట్టు ఉంది. అక్కడ ఏడు అసెంబ్లీ సీట్లలో ఆ పార్టీ ఖచ్చితంగా గెలుస్తుంది. కాంగ్రెస్ లేదా.. బీఆర్ఎస్ పార్టీకి మ్యాజిక్ మార్క్‌కు సీట్లు తక్కువ వచ్చాయంటే.. మజ్లిస్ మీద ఆధారపడాల్సిందే. ఇప్పటి వరకూ మజ్లిస్ ఎప్పుడూ ప్రభుత్వంలో భాగస్వామ్యం అవ్వలేదు. గ్రేటర్ కార్పోరేషన్ ఎన్నికల్లో మాత్రం ఓసారి అధికారాన్ని పంచుకున్నారు కానీ రాష్ట్ర ప్రభుత్వంలో మాత్రం భాగస్వామ్యం కాలేదు. మజ్లిస్ రాజకీయం ఎప్పుడూ వేరేగా ఉంటుంది. వాళ్లకి కావలసింది పదవులు కాదు. పవర్. పాతబస్తీకి సంబంధించిన పవర్ ఉంటే చాలనుకుంటారు. అందుకే ఈ సారి పాతబస్తీలో వచ్చే ఏడు సీట్లు కాకుండా.. బయట మరో మూడు, నాలుగు సీట్లలో గెలవాలని టార్గెట్‌గా పెట్టుకుంది. ఇవన్నీ తెలంగాణ రణక్షేత్రంలో గట్టిగా తలబడుతుంటే.. ఒక పార్టీ మాత్రం చాపకింద నీరులా తన పని తాను చేసుకుపోతోంది. తాము కింగ్ అవలేం కానీ.. కింగ్ మేకర్ కావొచ్చని అనుకుంటోంది. తెలంగాణ హంగ్ వస్తే.. తమకు మంచి డిమాండ్ ఉంటుందని ఆ పార్టీ అనుకుంటోంది. ఎందుకంటే ఎందుకంటే ఏది ఏం జరిగినా ఆ పార్టీ కచ్చితంగా గెలిచే సీట్లు కొన్ని ఉన్నాయి. అదే మజ్లిస్ ఇత్తెహదుల్ ముస్లిమీన్.. ఓఎం. తెలంగాణలో హంగ్ రావాలని.. వస్తే ఇక తమదే హంగామా అని ఆ పార్టీ అంచనాలు కడుతోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రెండ సార్లు ఎన్నికలు జరిగాయి. రెండు సార్లు బీఆర్ఎస్‌కు పూర్తి మెజార్టీ వచ్చింది. కానీ తెలంగాణ రాజకీయాల్లో ఒక విభిన్నత ఉంది. ఇక్కడ పార్టీలకు ఓటు బ్యాంక్ ఉండటం. తెలంగాణ ఏర్పడిన 2014లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అతి స్వల్ప మెజార్టీతో అధికారంలోకి వచ్చింది. తెలంగాణ మొత్తం మీద 119 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. అంటే ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి కావాల్సిన మ్యాజిక్ మార్క్ 60. 2014లో బీఆర్ఎస్ పార్టీకి వచ్చిన సీట్లు 63. అంటే

### సిక్కిం వరదలు.. 14 మంది మృతి

## 102 మంది గల్లంతు



గ్యాంగ్‌టక్ - ప్రభాత సూర్యుడు

మెరుపు వరదలతో సిక్కిం అతలాకుతలమైంది. ఉత్తర సిక్కింలోని లోనాక్ సరస్సు ప్రాంతంలో మంగళవారం అర్ధరాత్రి సమయంలో కుంభవృష్టి కురవడంతో .. లోచెన్ లోయలోని తీస్తా నదికి భారీగా వరదలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పటి వరకు 14 మంది మరణించగా, 102 మంది గల్లంతయ్యారు. గల్లంతైన వారిలో 23 మంది ఆర్మీ సిబ్బంది కూడా ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. ఇప్పటి వరకు 26 మంది గాయపడ్డారు. 2,000 మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. 11 వంతెనలు కొట్టుకుపోయాయని, 22,000 మందికి పైగా ప్రజలు ప్రభావితమయ్యారని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.
ఆర్మీ మరియు నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్

మిగతా 3లో...

### సిద్దిపేటలో మెడికల్ కాలేజకి

## అనుబంధంగా ఆస్పత్రి ప్రారంభం

మెదక్- ప్రభాత సూర్యుడు




తెలంగాణ సీఎం కేసీఆర్ ఢిల్లీ వచ్చినప్పుడు తనతో ఎన్డీఏలో చేరేందుకు ఆసక్తి చూపించారన, కేటీఆర్‌ను సీఎం ను చేసేందుకు సహకరించాలని కోరారని ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై హరీష్ రావు పరోక్షంగా స్పందించారు. కేసీఆర్ ఎప్పుడు ఢిల్లీకి వచ్చినా ప్రాజెక్టుల గురించి ..నిధుల గురించి అడుగుతారని.. అదే ఏపీ సీఎం జగన్ వస్తే.. సీబీఐ కేసుల గురించే మాట్లాడతారని పార్లమెంట్‌లోనే చెప్పారన్నారు. హరీష్ రావు మాటలు వైరల్ అవుతున్నాయి. సిద్దిపేటలో సిద్దిపేటలో మెడికల్ కాలేజీలకు అనుబంధంగా నూతనంగా నిర్మించిన 1000 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ను రాష్ట్ర ఆర్థిక ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు ప్రారంభించారు. 175 సీట్లు సిద్దిపేట మెడికల్ కళాశాలలో అడ్మిషన్లు పొందుతారని, ఇందులో 25% అంటే 25 సీట్లు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి చదువుతారని, ఢిల్లీ రాజస్థాన్ లాంటి రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి చదువుతున్నారంటే తెలంగాణ అభివృద్ధి ఏంటో అర్థం అవుతుందని ప్రశంసించారు. గతంలో సిద్దిపేట మెడికల్ కాలేజ్ నుంచి మెరుగైన వైద్యం కోసం గాంధీ, ఉస్మానియా ఆసుపత్రికి పంపించేవారు కానీ ఇకపై నుండి ఇక్కడే సూపర్ స్పెషాలిటీ సేవలు అందుతాయని, నూతన క్యాన్సర్ బ్లాక్ నిర్మాణా నికి కూడా .

మిగతా 2లో...

### అధికారం శాశ్వతం కాదు..

## ప్రత్యర్థులను వేధించొద్దు

### మాజీ మంత్రి దేవేందర్ గౌడ్ పుస్తకావిష్కరణ సభకు ముఖ్య అతిథిగా హాజరైన వెంకయ్యనాయుడు




హైదరాబాద్- ప్రభాతసూర్యుడు

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సమకాలీన రాజకీయాలపై పలు వ్యాఖ్యలు చేసారు. రాజకీయాల్లో ప్రత్యర్థులు తప్ప శత్రువులు ఉండకూడదని వ్యాఖ్యానించారు. దుర్భాషలాడే నేతలకు ఓటుతో సమాధానం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అక్రమార్జనకు, ప్రత్యర్థులను వేధించడానికి అధికారాన్ని అడ్డుపెట్టుకోరాదని అయన హితవు పలికారు. అధికారం శాశ్వతం కాదని అన్నారు. ఉమ్మడి రాష్ట్ర మాజీ
హోంమంత్రి, మాజీ ఎంపీ

మిగతా 2లో...

## తెలంగాణలో ఓటర్ల సంఖ్య 3.17 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణాలో ఓటర్ల సంఖ్య 3.17 కోట్లు. ఏకపక్షంగా ఓట్లను తొలగించలేదు. 35వేల పోలింగ్ స్టేషన్లు. 8.11 లక్షల కొత్త ఓటర్ల నమోదు అయ్యారు. అభ్యర్థుల ప్రచార వ్యయాన్ని పెంచాలని కొన్ని పార్టీలు కోరాయి. తెలంగాణాలో మహిళలు పురుష ఓటర్లు సమానంగా ఉన్నారు. 80 ఏళ్ళు దాటిన వారికీ ఇంటినుంచే ఓటు వేసే అవకాశం వుంటుంది. 35,356 మొత్తం పోలింగ్ కేంద్రాలు , ఒక్కో పోలింగ్ కేంద్రంలో సగటు ఓటర్లు 897 మంది ఓటర్లని అయన అన్నారు.

## భారత్‌కు మరో రెండు బంగారు పతకాలు

(మొదటి పేజీ తరువాయి)

జట స్వర్ణం సాధించింది. అదేవిధంగా సునీల్ కుమార్, గ్రెసొ జంట రజతం గెలుపొందింది.హోరాహోరీగా జరిగిన ఫైనల్లో మలేషియా జంట అజ్మన్, సైఫిక్ బిన్ కమల్‌ను ఓడించారు. బెస్ట్ ఆఫ్ త్రీ గేమ్స్‌లో.. ఇండియన్ జోడి సూపర్ గేమ్‌ను ప్రదర్శించింది. తొలి గేమ్‌లో 11-7 స్కోరుతో ప్రత్యర్థిపై దీపిక జోడి ఆధిపత్యం ప్రదర్శించింది. ఇక రెండవ గేమ్ మాత్రం హోరాహోరీగా సాగింది.ఓ దశలో ఈజీగానే వెళ్తున్నట్లు కనిపించినా.. మలేషియా జోడీ చివర్లో జోరును పెంచింది. దీంతో రెండవ గేమ్ రసవత్తరంగా సాగింది. 11-10 స్కోరు తేడాతో రెండవ గేమ్‌ను గెలిచిన దీపిక జంట.. ఆసియా క్రీడల్లో చరిత్ర సృష్టించింది. ఇండియా ఖాతాలోకి మరో బంగార పతకం వెళ్లింది. ఈ సారి క్రీడల్లో ఇప్పటి వరకు ఇండియాకు 20 గోల్డ్ మెడల్స్ దక్కాయి. నిరాశపరిచిన షట్లర్ పీవీ సింధు ఇక షట్లర్ పీవీ సింధు నిరాశపరిచింది. బ్యాడ్మింటన్ ఉమెన్స్ సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్స్‌లో చైనాకు చెందిన హి బిన్‌జియావో చేతిలో 16-21, 12-21తో ఓడిపోయింది. బిన్‌జియావో విజృంభించడంతో మ్యాచ్ మొత్తం ఏకపక్షంగా సాగింది.

## 2040 నాటికల్లా చంద్రునిపై ఇళ్ల నిర్మాణాలను చేపట్టనున్న నాసా!

(మొదటి పేజీ తరువాయి)

మీరు చదువుతోంది అక్షరాల నిజం. న్యూయార్క్ టైమ్స్ కథనం ప్రకారం.. 2040 నాటికల్లా చంద్రునిపై ఇళ్ల నిర్మాణాలను నాసా చేపట్టనుందట! చంద్రుని ఉపరితలంపై పరిశోధనలు జరిపేందుకు గాను వ్యోమగాములు అత్యధిక సమయం చంద్రునిపై ఉండేందుకు ఈ నిర్మాణాలు తోడ్పడుతాయని నాసా భావిస్తోంది. 3డీ ప్రింటర్లను చంద్రునిపైకి పంపించి.. అక్కడున్న రాక్ చిప్స్, ఖనిజ శకలాల సహకారంతో ఈ ఇళ్లను నాసా నిర్మించనుంది.ఈ విషయంపై నాసా డైరెక్టర్ నిక్కీ వెర్కీసర్ మాట్లాడుతూ.. "ప్రస్తుతం మనం అత్యంత కీలకమైన సమయంలో ఉన్నాం. కొన్ని మార్గాల్లో ఇది ఒక కలలా అనిపించొచ్చు. మరికొన్ని మార్గాల్లో.. చంద్రునిపైకి చేరుకోవడం అనివార్యమని అనిపిస్తుంది. పలు విశ్వవిద్యాలయాలు, ప్రైవేట్ కంపెనీల భాగస్వామ్యంతో.. అత్యాధునిక సాంకేతిక ఆధారంగా ఈ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని అనుకుంటున్నాం. మేమంతా ఒక ఉమ్మడి లక్ష్యంతో.. సరైన సమయంలో సరైన వ్యక్తులను ఒక చోటుకి చేర్చాం. చంద్రునిపైకి మేము తప్పకుండా చేరుకుంటామని భావిస్తున్నాం. ప్రతి ఒక్కరూ ఈ అడుగు ముందుకు వేయడానికి సిద్ధంగా ఉన్నారు. అందుకు తగిన ప్రధాన సామర్థ్యాలను అభివృద్ధి చేస్తే.. చంద్రునిపైకి చేరుకోవడం పెద్ద కష్టమేమీ కాకపోవచ్చు. ప్రస్తుతం 3డీ ప్రింటర్ పరిశోధన దశలో ఉంది. దీని పనితీరు మేము పరిక్షిస్తున్నాం. 2024 ఫిబ్రవరిలో ఈ 3డీ ప్రింటర్‌ను చంద్రునిపైకి పంపుతాం" అని చెప్పుకొచ్చారు.అయితే.. అంతకన్నా ముందు ఆర్టెమిస్-2, ఆర్టెమిస్-3 ప్రయోగాలకు నాసా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అంతకుముందు చేపట్టిన ఆర్టెమిస్-1 మిషన్ విఫలమైంది. ఇందులో మనుషులు కాకుండా రోబోట్స్ మాత్రమే ఉంచి, కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి పంపాలనుకున్నారు. అయితే.. ఇది చివరి నిమిషంలో బ్లాస్ట్ అయిపోయింది. ఇప్పుడు ఆర్టెమిస్-2 మిషన్‌లో భాగంగా నలుగురు వ్యోమగాముల్ని పంపించేందుకు నాసా రెడీ అవుతోంది. అయితే.. వీళ్లు నేరుగా చంద్రుని ఉపరితలంపై ల్యాండ్ అవ్వరు. చంద్రుని ఉపరితలానికి 9 వేల కిలోమీటర్ల దూరంలోని కక్ష్యలోకి వెళ్లి, చంద్రుడిని చుట్టేసి వస్తారు. ఈ యాత్ర విజయవంతం అయ్యాక.. 2025 లేదా 2026లో ఆర్టెమిస్-3 మిషన్ని స్పేస్‌ఎక్స్ స్టార్‌షిప్ సహాయంతో నాసా చేపడుతుంది. ఈ మిషన్‌లో భాగంగా ఒక మహిళతో పాటు నలుగురు వ్యోమగాములు చంద్రుని దక్షిణ ధ్రువంపై ల్యాండ్ అవుతారని నాసా పేర్కొంది.

## అధికారం శాశ్వతం కాదు.. ప్రత్యర్థులను వేధించొద్దు

(మొదటి పేజీ తరువాయి)

తూళ్ల దేవేందర్ గౌడ్.. రాజ్యసభ, శాసనసభల్లో చేసిన ప్రసంగాల ఆధారంగా రూపొందించిన పుస్తకాల ఆవిష్కరణ సభ బుధవారం హైదరాబాదులోని జూబ్లీహిల్స్లో జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తాజా రాజకీయ పరిణామాలపై స్పందించారు. ద్వేషపూరిత, కుట్రపూరిత రాజకీయాలు వద్దని చెప్పారు. ప్రజా తీర్పును, ప్రతిపక్షాలను గౌరవించాలన్నారు. కొంతమంది నేతలు నోరు విప్పితే దుర్భాషలేనని, కర్త, కర్మ, క్రియ అన్నీ అసభ్య పదాలేనని చెప్పారు. ప్రజా ప్రతినిధుల వ్యవహారశైలిని ప్రజలు గమనించి కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ఓటు వేయాలని సూచించారు. అసభ్యంగా మాట్లాడేవారికి పోలింగ్ బూత్లో సమాధానం చెప్పాలని పేర్కొన్నారు. తాను, దివంగత జైపాల్రెడ్డి ముఖ్యమంత్రులపై ఎన్ని విమర్శలు చేసినా అవి విషయానికి లోబడే ఉండేవని, ఇప్పుడు ఆ స్థాయి విమర్శలను సహించే పరిస్థితి లేదని విచారం వ్యక్తం చేశారు. సందర్భంగా దేవేందర్ గౌడ్పై మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రశంసల వర్షం కురిపించారు. దేవేందర్ గౌడ్ ఆదర్శవంతమైన నాయకుడన్న ఆయన పది శాఖలకు దేవేందర్ గౌడ్ మంత్రిగా పనిచేసినా ఎలాంటి మచ్చ లేకుండా కొనసాగారని అన్నారు.

# మజ్లీస్ మాస్టర్ ప్లాన్

(మొదటి పేజీ తరువాయి)

సాధారణ మెజార్టీ కంటే మూడు అంటే మూడు సీట్లు ఎక్కువ. కిందటి ఎన్నికల్లో బలపడింది. కానీ ఈ సారి మాత్రం పదేళ్ల అధికార వ్యతిరేకత ఎక్కువగా ఉంటుందన్న అభిప్రాయం వినిపిస్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ సీన్ అయిపోయింది.. ఇక బీజేపీనే ప్రత్యామ్నాయం అంటూ జరిగిన ప్రచారాన్ని పటాపంచలు చేస్తూ ఎన్నికల సమయానికి కాంగ్రెస్ బలంగా తయారైంది. మొదటి ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పాటు టీడీపీ, బీజేపీ, వైసీపీ, మజ్లిస్ , కమ్యూనిస్టులు ఇలా అన్ని పార్టీలూ ఓట్లు, సీట్లు తెచ్చుకున్నాయి. అన్ని పార్టీలకూ అసెంబ్లీలో ప్రాతినిధ్యం దక్కింది. కానీ రాజకీయ పునరేకీకరణ పేరుతో కేసీఆర్ చాలా పార్టీల్ని నిర్వీర్యం చేయడంలో విజయవంతం అయ్యారు. 2018కి వచ్చే సరికి .. టీడీపీ పూర్తిగా బలహీనపడింది. కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుని రెండు సీట్లకే పరిమితమయింది. బీజేపీకి ఒక్క సీటే మిగిలింది. ఇప్పుడు మళ్లీ మూడో సారి ఎన్నికలకు వచ్చే సరికి తెలంగాణ రాజకీయం మరింతగా మారిపోయింది. ఇప్పుడు బీఆర్ఎస్, కాంగ్రెస్ , బీజేపీ హోరాహోరీగా తలపడుతున్నాయి. పాతబస్తీని కంచుకోటగా మార్చుకున్న మజ్లిస్ .. మరిన్ని సీట్లు పెంచుకోవాలనుకుంటోంది. మజ్లిస్ భిన్నమైన రాజకీయం చేస్తుంది. భారత దేశంలో ఉన్న రాజకీయ పార్టీలు అన్నీ ప్రజలకు ఏమి చేస్తామో మేనిఫెస్టో విడుదల చేస్తాయి. కానీ మజ్లిస్ చరిత్రలో మేనిఫెస్టో అనే పదమే ఇంత వరకూ ఉపయోగించలేదు. ప్రజలకు ఏమి చేస్తామో వారు చెప్పరు. కానీ ఆ ప్రాంత ప్రజలు మరో ప్రత్యామ్నాయం చూడరు. ఒకప్పుడు మజ్లిస్ బచావో తెహరిక్.. ఎంబీటీ పార్టీ పోటీగా ఉండేది. కానీ మజ్లిస్ రాజకీయాల దెబ్బకు మెల్లగా ఆ పార్టీ ఫేడవుట్ అయిపోయింది. ఓవైసీ వాళ్లు అధికారంలో ఉండే ప్రతీ పార్టీతో సన్నిహితంగా ఉంటారు. పాతబస్తీ జోలికి రాకుండా ఉంటే.. బయట వైపు తమ మద్దతు ఉంటుందని నమ్మకం కలిగిస్తారు. అందుకే మరే పార్టీ మజ్లిస్ కంచుకోటల్లోకి వెళ్లే ప్రయత్నం చేయలేదు. దాంతో ఆ ప్రాంతాన్ని మజ్లిస్ తమ సామ్రాజ్యంగా మలుచుకుంది. ఇప్పుడు మజ్లిస్ మరింతగా ఎదిగేందుకు ప్రయత్నిస్తోంది. కింగ్ మేకర్లు కావాలని టార్గెట్ గా పెట్టుకుంది. తమ ప్రమేయం లేకుండా రాజకీయం ఉండదని అక్బరుద్దీన్ చాలాసార్లు అన్నారు. ఇప్పటి వరకూ ఇతర రాష్ట్రాల్లోనూ ఎన్నికల్లో పోటీ చేస్తున్న మజ్లిస్ తెలంగాణలో మాత్రం పాతబస్తీకే పరిమితమవుతూ వస్తోంది. ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పార్టీని విస్తరించాలని భావిస్తోంది. కిందటి బడ్జెట్ సమావేశాల్లో కేటీఆర్‌తో వాగ్వాదం సందర్భంగా మజ్లిస్ పార్టీ పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ వచ్చేసారి కనీసం 15 మంది ఎమ్మెల్యేలతో శాసనసభకు వస్తామని సవాల్ చేశారు. అందుకు అనుగుణంగానే ఆ పార్టీ ప్రణాళికలు రచిస్తోంది. దాదాపు 30 సీట్లలో పోటీ చేసేందుకు ప్లాన్ చేస్తోంది. వీటిలో 15 సీట్లు గెలవాలని టార్గెట్ పెట్టుకుంది. పాతబస్తీలోని చార్మినార్, యాకుత్ పురా, మలక్ పేట, బహదూర్ పురా, కార్వాన్, చాంద్రాయణగుట్ట, నాంపల్లి నియోజకవర్గాల్లో ఆ పార్టీ ఈ సీట్లలో గెలుస్తూ వస్తోంది. పాతబస్తీలోని 7 స్థానాలతో పాటు మహబూబ్‌నగర్, గద్వాల, రాజేంద్రనగర్, గోషామహల్, ముషీరాబాద్, అంబర్ పేట, నిజామాబాద్ అర్బన్, బోధన్, ముధోల్, ఆదిలాబాద్, వరంగల్ తూర్పు, నిర్మల్, బాన్సువాడ, కరీంనగర్, జహీరాబాద్, సంగారెడ్డి, ఆందోల్, తాండూరు, కొడంగల్ తదితర నియోజకవర్గాల్లో నముస్లింల జనాభా ఎక్కువగా ఉంటుంది. అలాంటి చోట్ల అభ్యర్థులను నిలబెట్టాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. ముస్లిం జనాభా ఎక్కువ ఉన్న చోట్ల బీసీలకు టిక్కెట్లు ఇవ్వడం ద్వారా రెండు వర్గాలను ఆకట్టుకుని గెలవాలనేది మజ్లిస్ ప్లాన్. గతంలో ఇలాంటి ప్రయోగాలు పెద్దగా సక్సెస్ కాలేదు. కానీ హిందూ అభ్యర్థుల్ని నిలబెట్టారు. 20 నుంచి 25 శాతం మైనారిటీ ఓటర్లు ఉన్న నియోజకవర్గాలపై దృష్టి పెట్టి, ఆయా చోట్ల పోటీ చేయాలని ప్రయత్నాలు చేస్తోంది. ఎక్కడెక్కడ పోటీ చేయాలనే దానిపై ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చినట్టు చెబుతున్నారు. మజ్లిస్‌కు పర్మనెంట్ ఫ్రెండ్స్ అంటూ ఎవరూ ఉండరు. అధికారంలోకి ఎవరు వస్తే.. వాళ్లతో కలిసి రాజకీయం చేస్తారు. మొన్న సీట్లు ప్రకటించినప్పుడు కూడా మజ్లిస్ మాకు మిత్రపక్షం.. వాళ్లున్న చోట ఫ్రెండ్లీ ఫైట్ అని కేసీఆర్ చెప్పారు కానీ.. ఓవైసీ మాత్రం ఇప్పటి దాకా బీఆర్ఎస్ తమ మిత్రపక్షం అని నేరుగా చెప్పలేదు. కానీ ఈ మధ్య కాలంలో వీళ్ల మధ్య సంబంధాలు బాగానే ఉన్నట్లు కనిపిస్తున్నాయి. అయితే మజ్లిస్‌కు కాంగ్రెస్ ఎప్పుడూ మిత్రపక్షమే. ఒకవేళ అధికారం షిఫ్ట్ అయితే... కాంగ్రెస్ తో కలిసిపోవడానికి వాళ్లకి పెద్ద అడ్డంకులు ఏం ఉండవ్. మరి బీజేపీ వస్తే పరిస్థితి ఏంటన్నది ప్రశ్న. ఓఎఓ చాలా రాష్ట్రాల్లో బీజేపీకి బీ-టీమ్ అన్నది ఎన్నాళ్లుగా వినిపిస్తున్న విమర్శ. మరి తెలంగాణలో బీజేపీకి అధికారం ఇవ్వడానికి సహకారం బ్యాకప్ ఏమైనా చేస్తారా అన్నది కూడా ఆలోచించాలి. ఎక్కువ స్థానాల్లో పోటీ చేసి.. కాంగ్రెస్, బీఆర్ఎస్ నుంచి ముస్లిం ఓట్లను దూరం చేసే వ్యూహమని విమర్శలు ఎలాగూ ఉన్నాయి. ఎన్ని విమర్శలు వచ్చినా ఓఎఓ మాత్రం తన పట్టును కోల్పోలేదు. ఈ సారి ఆ పట్టును మరింత బిగించాలని చూస్తోంది.

## సిద్దిపేటలో మెడికల్ కాలేజకి అనుబంధంగా ఆస్పత్రి ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

శంకుస్థాపన చేసుకోవడం జరిగింది. ఇకనుండి క్యాన్సర్ చికిత్స కూడా ఇక్కడే అందించబడుతుందని హరీష్ రావు పేర్కొన్నారు.ఈ ఆస్పత్రిలో 40 పడకల డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేశామని, 15 అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు అందులో 8 మార్జిలర్ ఆపరేషన్ థియేటర్లు నిర్మించుకున్నామని, 100 ఐసియు బెడ్ లు పూర్తి సామర్థ్యంతో సేవలు అందు బాటులోకి వస్తాయని ప్రైవేట్ కి దీటుగా వైద్య సేవలు అందిస్తామని వెల్లడించారు. 30 పడకలతో ఎమర్జెన్సీ వార్డు ఉంటుందని, 23 కోట్లతో 50 పడకల సూపర్ స్పెషాలిటీ క్రిటికల్ కేర్ బ్లాకు ఏర్పాటు చేయబోతున్నామని, 875 మంది వైద్య విద్యార్థులు ఉంటారని హరీష్ రావు వివరించారు. 13 డిపార్ట్ మెంట్లలో పిజి కోర్సులు అందుబాటులో ఉన్నాయని, మరో 3 నూతన పిజి సీట్లు ఏర్పాటు చేశామని, ప్రతి ఏడాది 62 మంది పిజి విద్యార్థులకు కూడా చదివే అవకాశం ఉందన్నారు. సంపన్నుల పిల్లలే డాక్టర్ చదువు చదవాలన్న నానుడిని మారుస్తూ రైతులు, కూలీల పిల్లలు కూడా ఎంబిబిఎస్ చేసే అవకాశం ముఖ్యమంత్రి కెసిఆర్ ఇచ్చారని కొనియాడారు. స్టాఫ్ నర్స్ ల పేరు మారుస్తూ నర్సింగ్ డాక్టర్ గా పిలుస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నర్సింగ్, బి ఫార్మసీ కాలేజ్ లు సిద్దిపేట లో ఉన్నాయని, 280 మంది డాక్టర్లు 24 గంటలు వైద్య సేవలు అందిస్తారని, వీరితోపాటు మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ పూర్తి చేసుకున్న 150 మంది డాక్టర్లు కూడా సేవలు అందిస్తారని ప్రశంసించారు. ప్రాథమిక చికిత్స నుండి ప్రాణాంతక వ్యాధుల వరకు అన్ని వైద్య సేవలు అందించబడతాయని, ఒకప్పుడు మనం నీళ్లు చూడనోళ్లం..కానీ ఇప్పుడు కరువు కూడా తెలియడం లేదని హరీష్ రావు చెప్పారు. నూతన క్యాన్సర్ బ్లాక్ నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేయడం జరిగిందని, ఇకనుండి క్యాన్సర్ చికిత్స కూడా ఇక్కడే అందించబడు తుందన్నారు మంత్రి హరీష్ రావు. ఆస్పత్రిలో 40 పడకల డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారని, 15 అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, అందులో 8 మార్జిలర్ ఆపరేషన్ థియేటర్లు నిర్మించుకున్నామని తెలిపారు మంత్రి హరీష్ రావు. 100 ఐసీయూ బెడ్లను ఏర్పాటు చేసి, పూర్తి సామర్థ్యంతో సేవలు అందిస్తు న్నామన్నారు. ప్రైవేటుకు ధీటుగా వైద్య సేవలు అందిస్తామని చెప్పారు. 30 పడకలతో ఎమర్జెన్సీ వార్డు, రూ. 23 కోట్లతో 50 పడకల సూపర్ స్పెషాలిటీ క్రిటికల్ కేర్ బ్లాక్ ఏర్పాటు చేయబో తున్నామని తెలిపారు. 875 మంది వైద్య విద్యార్థులు ఉంటారని, 13 డిపార్ట్ మెంట్లలో పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, మరో 3 నూతన పీజీ సీట్లు ఏర్పాటు కానున్నాయని తెలిపారు మంత్రి. ప్రతి ఏడాది 62 మంది పీజీ విద్యార్థులకు కూడా చదివే అవకాశం ఉంటుందని వివరించారు. సంపన్నుల పిల్లలే డాక్టర్ చదువు చదవాలన్న నానుడిని మారుస్తూ రైతులు, కూలీల పిల్లలు కూడా ఎంబీబీఎస్ చేసే అవకాశాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ కల్పించారని పేర్కొన్నారు. స్టా?ఫ్ నర్సుల పేరు మారుస్తూ నర్సింగ్ డాక్టర్‌గా పిలుస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. నర్సింగ్, బి ఫార్మసీ కాలేజ్‌లు సిద్దిపేటలో ఉన్నాయని చెప్పారు. 280 మంది డాక్టర్లు, 24 గంటలు సేవలు అందిస్తారని తెలిపారు మంత్రి హరీష్ రావు. వీరితోపాటు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేసుకున్న 150 మంది డాక్టర్లు కూడా సేవలు అందిస్తారన్నారు. ప్రాథమిక చికిత్స నుండి ప్రాణాంతక వ్యాధుల వరకు అన్ని వైద్య సేవలు అందించబడతాయన్నారు. ఒకప్పుడు మనం నీళ్లు చూడనోళ్లం.. కానీ ఇప్పుడు కరువు ఎరగనోల్లం అయ్యామని మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు. 'ఒక ప్రాంతానికి కావాలిసిన కలలను సాకారం చేసుకున్నాం, సిద్దిపేట జిల్లా చేసుకున్నాం, సిద్దిపేటకు గోదావరి నీళ్లు తెచ్చుకున్నాం, సిద్దిపేట కి రైల్ కూడా తెచ్చుకున్నాం. వేయి పడకల ఆస్పత్రి వచ్చింది. ఇన్ని ఇచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు. సిద్దిపేట ప్రజలకు శుభాకాంక్షలు.' అని మంత్రి హరీష్ రావు అన్నారు.

## హ్యాట్రిక్ రచనల్లో కేటీఆర్ హరీష్

(మొదటి పేజీ తరువాయి)

ఓవైపు ఆరు గ్యారెంటీలతో పాటు పలు డిక్లరేషన్లను ప్రకటించి? జనాలను ఆకర్షించే ప్రయత్నం చేసేసింది కాంగ్రెస్. అయితే దీనికి ధీటుగా ఈసారి మేనిఫెస్టో ఉండేలా గులాబీ పెద్దలు కసరత్తు చేస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇదే విషయంపై మంత్రి హరీశ్ రావు కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్షాలు విస్తుపోయేలా బీఆర్ఎస్ మేనిఫెస్టో ఉండబోతుందని చెప్పుకొచ్చారు. దీంతో?. గులాబీ బాస్ కేసీఆర్ ప్రకటించే హామీలపై మరోసారి ఉత్కంఠ నెలకొందనే చెప్పొచ్చు. ఇకపోతే? ప్రగతి భవన్ వేదికగా నియోజకవర్గాల వారీగా సర్వే రిపోర్టులను పరిశీలిస్తున్నారట కేసీఆర్. ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించిన నేపథ్యంలో? గ్రౌండ్ లో నెలకొన్న పరిస్థితులపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారని తెలుస్తోంది. అందుకు తగ్గట్టుగా వ్యూహాలు రచిస్తున్నారట.!ఇక ఇదే నెలలో ఓరగల్లు వేదికగా భారీ సభను నిర్వహించటంతో పాటు మేనిఫెస్టోను కూడా ప్రకటిస్తామని కేసీఆర్ ఇప్పటికే ప్రకటించారు.మరికొద్దిరోజుల్లో ఎన్నికలు రానున్న నేపథ్యంలో?. పార్టీలో కీలక నేతలుగా ఉన్న మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు దూకుడు పెంచేశారు. గడిచిన 20 రోజులుగా ఓవైపు కేటీఆర్ పలు నియోజకవర్గాల్లో పర్యటిస్తుండగా? మరోవైపు హరీశ్ రావు కూడా పలు జిల్లాలో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ఓవైపు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తూ? అదే సమయంలో పార్టీ తలపెడుతున్న ప్రగతి నివేదన సభల్లో ప్రసంగిస్తున్నారు. తొమ్మిదేళ్లలో కేసీఆర్ సర్కార్ చేసిన అభివృద్ధిని వివరిస్తూనే? మరోవైపు ప్రతిపక్ష కాంగ్రెస్ ను సీరియస్ గా టార్గెట్ చేస్తున్నారు. మూడు పంటల కేసీఆర్ కావాలా? మూడు గంటల కరెంట్ చాలు అంటున్న కాంగ్రెస్ కావాలా అంటూ ప్రజలను ఆలోచనలో పడేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇక సందర్భాన్ని బట్టి? బీజేపీ నేతలను కూడా కార్నర్ చేస్తున్నారు. వరసుగా నియోజకవర్గాల్లో పర్యటిస్తూ? కేడర్ తో పాటు నేతల్లో ఉత్సాహం నింపుతున్నారు. ఇదిలా ఉంటే అసంతృప్త నేతలను కూడా లైన్ లోకి తీసుకొచ్చేలా పావులు కదుపుతున్నారు.ఇక టికెట్లు దక్కని నేతలకు హామీలు ఇస్తున్నారు గులాబీ పెద్దలు. ఇప్పటికే పలు నామినేటెడ్ పదవులను భర్తీ చేయగా? మరికొన్నింటిని కూడా భర్తీ చేయాలని చూస్తోంది. ఇక ఇప్పుడు కుదరకపోతే మరోసారి అధికారంలోకి రాగానే అవకాశాలు ఇస్తామనే భరోసా కల్పిస్తున్నారు. విబేధాలు పక్కన పెట్టి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలని సూచిస్తున్నారు. ఈ విషయంలో కేటీఆర్, హరీశ్ రావు ముఖ్యంగా చొరవ తీసుకుంటున్నారు. రాబోయే రోజుల్లో ఇద్దరు నేతలు? మరిన్ని నియోజకవర్గాల్లో పర్యటించేందుకు సిద్ధమవుతున్నారు. మొత్తంగా చూస్తే.. హ్యాట్రిక్ విక్టరీనే లక్ష్యంగా బీఆర్ఎస్ అడుగులు వేస్తోంది. అయితే మరోసారి ప్రజాఆశీర్వాదం పొందుతారా..? లేదా..? అనేది చూడాలి.

## సంపాదకీయం

# అక్కరకు రానున్న యుద్ధతంత్రాలు

యుద్ధం చేయాలంటే బలగం ఉంటే సరిపోదు. సరైన వ్యూహం ఉండాలి. శత్రువుని ఎలా కొట్టాలి..? ఎలా పడగొట్టాలి..? అనే క్లారిటీ ఉండాలి. ఇలాంటి స్ట్రాటెజీలు లేనప్పుడు ఎంత బలమున్నా వృథానే. భారత్ ఇప్పుడీ వ్యూహాలపైనే దృష్టి పెట్టింది. ఇప్పటికే రక్షణ రంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చింది. అటు చైనా, ఇటు పాకిస్థాన్‌కి ఎప్పటికప్పుడు దీటుగా బదులు చెబుతోంది. అయితే...యుద్ధ వ్యూహాల కోసం చరిత్ర పుస్తకాలు తిరగేస్తోంది. భారత సంస్కృతితో ముడి పడి, ఈ దేశానికి మాత్రమే సొంతమైన అరుదైన యుద్ధ రీతులు, వ్యూహాలను రిఫర్ చేయనుంది. దీంతో పాటు దౌత్య విధానాన్నీ పరిశీలించనుంది. ఈ ప్రాజెక్ట్‌కి "ప్రాజెక్ట్ ఉద్దవ్" అనే పేరు పెట్టింది. ఇందుకోసం రక్షణ రంగానికి చెందిన సహకారం తీసుకోనుంది. ఈ క్రమంలోనే...అక్టోబర్ 21,22వ తేదీల్లో జూఎ మిలిటరీ హెరిటేజ్ ఫెస్టివల్‌ని నిర్వహించనుంది. దేశ భద్రత విషయంలో భారత వ్యూహాలు, మిలిటరీ సామర్థ్యాలు, భద్రతా బలగాల నవీకరణతో పాటు ఆత్మనిర్భర భారత్ గురించి ఈ ఫెస్టివల్‌లో చర్చించనున్నారు. ఈ విషయాన్ని ఇండియన్ ఆర్మీ కూడా ధ్రువీకరించింది.భారత్‌కి మాత్రమే సొంతమైన, ఈ సంస్కృతితో ముడిపడిన అరుదైన యుద్ధ రీతులు, వ్యూహాలను పరిశీలించడమే ఈ ప్రాజెక్ట్ ఉద్భవ్ లక్ష్యం. ఇందుకోసం చరిత్రలో యుద్ధాల గురించి రాసిన పుస్తకాలను, ఆయా రాజ్యాలు అనుసరించిన రీతుల్ని గమనిస్తాం. వీటిపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేస్తాం. వీటితో పాటు కౌటిల్యుడు చెప్పిన యుద్ధ తంత్రాన్నీ పరిశీలిస్తాం"ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ కోసం ప్రత్యేకంగా ఓ ప్యానెల్‌ని కూడా ఏర్పాటు చేసింది భారత ప్రభుత్వం. సెప్టెంబర్ 29న భేటీ కూడా అయింది. ఇప్పుడున్న యుద్ధ వ్యూహాలను ఎలా సంస్కరించాలో చర్చించారు. చరిత్రలో ఆయా రాజ్యాల్లోని యుద్ధ కళలు, రీతులను పరిశీలిస్తూనే ఇప్పటి కాలానికి తగ్గట్టుగా వాటిని ఎలా అప్లై చేసుకోవచ్చో అధ్యయనం చేయనున్నారు. రాజ్యాలు తమ సైన్యాలను ఎలా పవర్‌ఫుల్‌గా మార్చుకున్నాయి..? కాలం గడిచే కొద్ది ఎలాంటి సంస్కరణలు జరిగాయి..? తమ నేలను ఎలా కాపాడుకున్నాయి..? అనే అంశాలపైనే ఎక్కువగా ఫోకస్ చేయనుంది ఈ ప్రాజెక్ట్ ఉద్భవ్. కేవలం వ్యూహాలను అధ్యయనం చేయడమే కాదు. అందుకు సంబంధించిన "పదాలపైనా" దృష్టి పెట్టనుంది. భారత్‌కి మాత్రమే సొంతమైన ఫిలాసఫీనీ పరిశీలించనున్నారు. నిజానికి...ఈ ప్రక్రియ 2021 నుంచే మొదలైంది. చరిత్ర పుస్తకాల నుంచి 75 సిద్ధాంతాలను సేకరించి ఓ బుక్ కూడా పబ్లిష్ చేశారు. ఇండియన్ ఆర్మీలోని అన్ని ర్యాంకులకు చెందిన అధికారులు ఈ పుస్తకాన్ని చదవాలని ఆదేశించారు. దీన్ని ఇంగ్లీష్‌లోకి ట్రాన్స్‌లేట్ చేసి అందరికీ అందించారు. అయితే..ఇటీవల ప్యానెల్ మీటింగ్‌లో కీలక ప్రతిపాదనలు తీసుకొచ్చారు. 4వ శతాబ్దం, 8వ శతాబ్దాల్లో కౌటిల్యుడు, కమందక, కురల్ లాంటి రాజ నీతిజ్ఞులు చెప్పిన యుద్ధ తంత్రాలనూ ఓ సారి పరిశీలించాలన్న చర్చ జరిగింది. వీటినే ఆధునిక యుద్ధ రంగానికి ఆపాదించుకుంటే బాగుంటుందన్న అభిప్రాయాలూ వ్యక్తమయ్యాయిప్రాజెక్ట్ ఉద్భవ్ అనేది స్టేట్‌క్రాఫ్ట్, వార్‌క్రాఫ్ట్, దౌత్యం మరియు గొప్ప వ్యూహం యొక్క పురాతన భారతీయ గ్రంథాల నుండి ఉద్భవించిన స్టేట్‌క్రాఫ్ట్ మరియు వ్యూహాత్మక ఆలోచనల యొక్క లోతైన ఇండిక్ వారసత్వాన్ని తిరిగి కనుగొనడానికి భారత సైన్యం చేపట్టిన చొరవ అని ఆర్మీ అధికారులు ఇక్కడ తెలిపారు.ఈ ప్రాజెక్ట్ స్టేట్‌క్రాఫ్ట్ వ్యూహాత్మక ఆలోచనల రంగాలలో భారతదేశం యొక్క గొప్ప చారిత్రక కథనాలను అన్వేషించడానికి ప్రయత్నిస్తుంది. ఇది స్వదేశీ సైనిక వ్యవస్థలు, చారిత్రక గ్రంథాలు, ప్రాంతీయ గ్రంథాలు మరియు రాజ్యాలు, నేపథ్య అధ్యయనాలు మరియు క్లిష్టమైన కౌటిల్య అధ్యయనాలతో సహా విస్తృత స్పెక్ట్రమ్‌పై దృష్టి పెడుతుంది.రాజ్యాధికారం, వ్యూహం, దౌత్యం మరియు యుద్ధంలో భారతదేశం యొక్క పురాతన జ్ఞానాన్ని భారత సైన్యం గుర్తించిందనడానికి ఈ మార్గదర్శక చొరవ సాక్ష్యంగా నిలుస్తుంది.దాని ప్రధాన భాగంలో, ప్రాజెక్ట్ ఉద్భవ్ చారిత్రక మరియు సమకాలీనానికి వారధిగా ప్రయత్నిస్తుంది.స్వదేశీ సైనిక వ్యవస్థల లోతైన లోతులను, వాటి పరిణామాన్ని, యుగాలుగా సాగిపోతున్న వ్యూహాలను, సహస్రాబ్దాలుగా భూమిని పరిపాలిస్తున్న వ్యూహాత్మక ఆలోచనా విధానాలను అర్థం చేసుకోవడమే లక్ష్యం అని వారు చెప్పారు.

## నగదు స్వాధీనం

**హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు :** బుధవారం రాత్రి పురానాపూల్ బ్రిడ్జి వద్ద తనిఖీలు నిర్వహిస్తున్ పోలీసులకు ఓ ద్విచక్ర వాహనదారుడు అనుమానాస్పదంగా కనిపించడంతో అతనిని ఆపి వాహనాన్నిసోదాలు చేసారు. అతని వద్ద నుండి 18 లక్షల రూపాయల నగదు లభ్యమయ్యాయి. పోలీసులు అడిగిన ప్రశ్నలకు పొంతన లేని సమాధానాలు చెప్పడంతో పోలీసులు రోహిత్ అనే సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా అతను హమీదుల్లా ఖాన్ అనే వ్యక్తి కోసం కలెక్షన్ ఏజెంట్గా పని చేస్తున్నట్లు వెల్లడయ్యింది.లెక్కలేని మరో 17 లక్షల 50 వేల రూపాయలు ముషీరాబాద్ లోని స్క్రాప్ దుకాణంలో ఉన్నట్లు సదరు వ్యక్తి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో మొత్తం 35 లక్షల 50 వేల రూపాయల లెక్కలేని డబ్బును పోలీసులు స్వాధీనం చేసుకున్నామని హైదరాబాద్ అదనపు కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్ వెల్లడించారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన నాయకులు



**కమాన్‌పూర్-ప్రభాత సూర్యుడు :** మండలకేంద్రంలోని గోకుల్ నగర్ కు చెందిన కొమ్ము పెద్ద గట్టయ్య ఇటీవలే మరణించగా వారి కుటుంబ సభ్యులను బుధవారం రామగుండం కా ర్మిక సంఘం నాయకుడు బిఆర్ఎస్ నేత కౌశిక హరి పరామర్శించారు.అలాగే కమాన్ పూర్ మండల బిజెపి పార్టీ శ్రేణులు పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.గట్టయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం వారి కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట బిజెపి మండల శాఖ అధ్యక్షుడు జంగిపల్లి అజయ్ ముకిరి రాజు మహావాది రామన్న మచ్చ గిరి రాము మల్లారపు అరుణ్ జంగిపల్లి శ్రీనివాస్ జంగేపల్లి సారయ్య గోపు పర్వతాలు కొమ్ము సారయ్యలు ఉన్నారు.

# కాంగ్రెస్‌కు షాకుల మీద షాకులు

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

ఒక వైపు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆయా పార్టీలు గెలుపు కోసం వ్యూహాలు రచిస్తున్నాయి. ఇక తెలంగాణ కాంగ్రెస్ కూడా ముందస్తు వ్యూహాలు రచిస్తూ ముందుకు సాగుతుంటే షాకుల మీద షాకులు తగులుతూనే ఉన్నాయి. సొంత పార్టీలోనే భగ్గుమనే రాజకీయాలు కొనసాగుతున్నాయి. ఒక వైపు ఎన్నికలు సమీపిస్తుండటం, మరో వైపు సొంతపార్టీలోనే వివాదాలు చెలరేగడం వంటివి టీ కాంగ్రెస్‌కు పెద్ద తలనొప్పిగా మారింది. ఇప్పుడు కాంగ్రెస్‌లో మైనంపల్లి పెట్టిన చిచ్చుతో రెండు జిల్లాల డీసీసీ అధ్యక్షులు రాజీనామాలు చేశారు. వాళ్లిద్దరూ ఇప్పుడు బీఆర్ఎస్ వైపు చూస్తున్నారు. మరో కాంగ్రెస్ నుంచి సస్పెండ్ అయిన మనోహర్ రెడ్డి రేవంత్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఆయనపై సీబీఐ, ఈడీకి ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. దీంతో టీ కాంగ్రెస్‌లో చిచ్చు కొనసాగుతూనే ఉంది. టీ కాంగ్రెస్‌లో మైనంపల్లి చిచ్చు చల్లారట్లేదు. టీ కాంగ్రెస్‌లో చేరిన మైనంపల్లి హన్మంతరావుకు మల్కాజ్‌గిరి సీటు, ఆయన కొడుకు రోహిత్‌కు మెదక్ అసెంబ్లీ సీటు ఇస్తారనే వార్తలు కాంగ్రెస్‌లో కల్లోలం రేపుతున్నాయి. దీనిపై కాంగ్రెస్ నేతలు భగ్గుమంటున్నారు. మొన్న మెదక్ డీసీసీ ప్రెసిడెంట్ తిరుపతి రెడ్డి పార్టీకి రాజీనామా చేయగా, నిన్న మల్కాజ్‌గిరి డీసీసీ ప్రెసిడెంట్ నందికంటి శ్రీధర్ పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఢిల్లీకి పిలిపించి రాహుల్ గాంధీ స్వయంగా బుజ్జగించినా, ఎంపీ టికెట్ ఇస్తామన్నా నందికంటి లెక్క చేయలేదు. కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పేశారు. కన్నతల్లిలాంటి కాంగ్రెస్ మోసం చేయడం తట్టుకోలేకపోతున్నానని అన్నారు. దీంతో కాంగ్రెస్‌లో మైనంపల్లి చేరిక చిచ్చు ఇంకా రగులుతూనే ఉంది. టీ కాంగ్రెస్‌లో మైనంపల్లి రేపిన మంటలు చల్లారకముందే.. కొత్త మనోహర్‌రెడ్డి, సరికొత్త వివాదం రేపారు. టీ పీసీసీ చీఫ్ రేవంత్‌పై ఆయన తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. ఎన్నికల్లో పోటీ చేయాలని ప్రయత్నిస్తున్న వారి నుంచి రేవంత్.. కోట్ల రూపాయలు వసూలు చేస్తున్నారంటూ ఆరోపించారు మనోహర్ రెడ్డి. ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి నుంచి రూ.6 కోట్లు, గాలి అనిల్ కుమార్ నుంచి 12 కోట్లు, రేవంత్ తీసుకున్నారని మనోహర్ ఆరోపించారు. దీంతో మనోహర్‌ను పార్టీ నుంచి బహిష్కరించారు. అయితే తాను ఢిల్లీ వెళ్లి సీబీఐ, ఈడీకి రేవంత్‌పై ఫిర్యాదు చేస్తానంటున్నారు మనోహర్. మరి కాంగ్రెస్‌లో తలెత్తుతున్న వివాదాలు ఎటువైపు వెళ్తాయన్నది వేచి చూడాలి.

**ఆశావహుల్లో టెన్షన్**

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ కాంగ్రెస్ ఆశావహుల్లో టెన్షన్ పెరిగిపోతోంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తొలి జాబితా మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. ఈ నెల మొదటి వారంలో తొలి జాబితా విడుదల చేయాలని నిర్ణయించినప్పటికీ... అనుకోని పరిస్థితులతో వాయిదా పడినట్లు తెలుస్తోంది. కేంద్రం ఎన్నికల సంఘం అధికారులు ఇప్పటికే తెలంగాణలో పర్యటిస్తున్నారు. రాజకీయ పార్టీలు, జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహించింది. ఎన్నికల సన్నద్ధతపై పలు సూచనలు చేసింది. ఎన్నికల షెడ్యూలు ఎప్పుడైనా రావచ్చని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ తేదీ ఖరారైతే...అదే రోజుగానీ మరుసటి రోజు మొదటి జాబితా ప్రకటన ఉంటుందని పీసీసీ భావిస్తోంది. ఎన్నికల షెడ్యూల్ కంటే ముందే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ప్రకటన ఉంటుందని అంచనా వేసినప్పటికీ అది సాధ్యమయ్యే అవకాశాలు కనిపించడం లేదు. ఈ వారంలో అభ్యర్థుల జాబితా విడుదల అవుతుందనుకున్నా పరిస్థితులు అలా కనిపించడం లేదు. 30 నియోజకవర్గాలకు ఒకే దరఖాస్తు రావడంతో వీరి అభ్యర్థిత్వానికి హైకమాండ్ ఒకే చెప్పినట్లు తెలుస్తోంది. మరో నియోజకవర్గాల్లో అభ్యర్థుల జాబితా కొలిక్కి వచ్చినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరో 30 నియోజకవర్గాల్లో టికెట్ల కోసం గట్టి పోటీ ఉండడంతో మరొకసారి సర్వేలు నిర్వహించాలని స్క్రీనింగ్ కమిటీ నిర్ణయించింది. ఈ నెల 7వ తేదీన పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం జరుగుతుందని అంచనా వేసినా, అది వాయిదా పడినట్లు తెలుస్తోంది. ఈ నెల రెండో వారంలో పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశమై తెలంగాణతో పాటు మిగిలిన రాష్ట్రాలకు అభ్యర్థుల ఎంపికపై తుది నిర్ణయం తీసుకుంటుందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. కేంద్ర ఎన్నికల కమిటీ తేదీ ఖరారైన వెంటనే, స్క్రీనింగ్ కమిటీ సమావేశమై మొదటి జాబితాకు దాదాపు 70 నియోజకవర్గాలకు అభ్యర్థుల పేర్లను ఖరారు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.సూర్యాపేట, జనగామ, ఖైరతాబాద్, ఎల్బీనగర్, జూబ్లీహిల్స్, మిర్యాలగూడ, భువనగిరి తదితర 27 నియోజకవర్గాలల్లో సర్వేలు జరిగినట్లు సమాచారం. గెలుపే లక్ష్యంగా పారదర్శకంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని పీసీసీ వర్గాలు చెబుతున్నాయి. గతంలో కూడా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఆలస్యం కావడం పార్టీ గెలుపుపై ఆ ప్రభావంతీవ్రంగా చూపినట్లు రాష్ట్ర నాయకత్వం అంచనా వేస్తుంది. అలాంటప్పుడు ముందస్తుగా అభ్యర్థుల ప్రకటన చేయాలని భావిస్తున్నప్పటికీ అవకాశాలు కనిపించడం లేదని కాంగ్రెస్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఎన్నికల షెడ్యూలు తేదీ ఆలస్యం అయ్యేటట్లయితే షెడ్యూల్ కన్నా ముందే మొదటి జాబితా విడుదలయ్యే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.గులాబీ బాస్ కేసీఆర్ ఒకే సారి 115 నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించేశారు. ఇప్పటికే బీఆర్ఎస్ అభ్యర్థులు ప్రచారం మునిగిపోయారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలను వివరిస్తున్నారు. మరోవైపు ముఖ్యమంత్రి కేసీఆర్ నోటిఫికేషన్ విడుదలకు ముందే కొత్త కొత్త అస్త్రాలతో ప్రతిపక్షాలను ఇరుకున పెట్టేలా వ్యవహరిస్తున్నారు. ఎన్నికల ముందు మరిన్ని కొత్త పథకాలను ప్రకటిస్తారని, ప్రతిపక్షాలకు మైండ్ బ్లాంక్ అవడం గ్యారెంటీ అంటూ మంత్రి హరీశ్ రావు ఇప్పటికే ప్రకటించేశారు. ఇలాంటి సమయంలో కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా ప్రకటన ఆలస్యం అవుతుండటంతో నేతల్లో ఊపిరి తీసుకోలేక పోతున్నారు. తమ సీటు వస్తుందా రాదా ? అన్న టెన్షన్ లో మునిగిపోయారు.

# 13 రోజుల పాటు దసరా సెలవులు

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:** బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకొని రాష్ట్రంలోని విద్యా సంస్థలకు విద్యాశాఖ సెలవులు ప్రకటించింది. అక్టోబర్ 13 నుంచి 25 వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ బడులు, కాలేజీలకు సెలవులు ఉంటాయని తెలిపింది. దాదాపు 13 రోజుల పాటు దసరా సెలవులు ప్రకటించింది. అక్టోబర్ 14న బతుకమ్మ పండుగ రానుంది. ఇక దుర్గాష్టమి, మహర్నవమి పండుగలు అక్టోబర్ 22, 23 తేదీల్లో వస్తున్నాయి. మిగతా రెండు రోజులను ఐచ్ఛిక సెలవులు కింద ఇస్తున్నట్లు విద్యాశాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు 2023-24 విద్యాసంవత్సరానికి గానూ దసరా సెలవులు ఇస్తున్నట్లు తెలంగాణ విద్యాశాఖ ప్రకటన విడుదల చేసింది.రాష్ట్రంలోని అన్ని రకాల స్కూళ్లలో సమ్మెటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు అక్టోబర్ 5వ తేదీ నుంచి అక్టోబర్ 11వ తేదీ వరకు జరగనున్నట్లు తన ప్రకటనలో పేర్కొంది. ఈ విద్యాసంవత్సరంలో స్కూళ్లకు మరో రెండు సార్లు సెలవులు రానున్నాయి. ఏడాది డిసెంబర్ 22 నుంచి 26వ తేదీ వరకు కూడా తెలంగాణ స్కూళ్లకు క్రిస్టమస్ సెలవులు రానున్నాయి. క్రిస్టమస్ అనంతరం సంక్రాంతి సెలవులు 5 నుంచి 6 రోజులు రానున్నాయి.

ఈ సెలవులను పాటించాలని సూచించింది. ఇంటర్మీడియట్ కాలేజీలు మాత్రం 19 నుంచి 25 వరకు సెలవులివ్వాలని పేర్కొన్నది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలల్లో అక్టోబర్ 14 నుంచి 24 వరకు దసరా సెలవులు ఇస్తున్నట్లు విద్యాశాఖ ఇప్పటికే ప్రకటన వెలువరించింది. అన్ని పాఠశాలల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు నిర్దేశించిన సిలబస్ ప్రకారం అక్టోబర్ 6వ తేదీ వరకు ఫార్మేటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్ఏ)? 2 పరీక్షలు పాఠశాల విద్యాశాఖ నిర్వహిస్తోంది. పాత పద్ధతిలోనే ఉమ్మడి ప్రశ్నాపత్రం ఆధారంగా పరీక్షలు నిర్వహిస్తోంది. పరీక్ష నిర్వహణ అనంతరం అక్టోబర్ 10వ తేదీలోగా సమాదాన పత్రాలను మూల్యాంకనం చేసి విద్యార్థులకు ఫలితాలు అందించాలని విద్యాశాఖ పాఠశాలలకు ఆదేశాలు జారీ చేసింది. ఆదేశించింది. మూల్యంకనం అనంతరం ఆన్‌లైన్ పోర్టల్‌లో విద్యార్థుల మార్కులు నమోదు చేయాలని పేర్కొంది. అక్టోబర్ 10వ తేదీన విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి విద్యార్థుల ప్రోగ్రెస్ గురించి తెలియజేయాలని చెప్పింది. ఈ ప్రక్రియ మొత్తం దసరా సెలవులకు ముందే పూర్తి చేయాలని అన్ని విద్యాసంస్థలకు సూచించింది.

## కెసిఆర్ స్పోర్ట్స్ కిట్స్, బతుకమ్మ చీరల పంపిణి

**నాగర్ కర్నూల్-ప్రభాత సూర్యుడు:** తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా బతుకమ్మ చీరల పంపిణి చేస్తుందని ఎమ్మెల్యే బీరం హర్ష వర్ధన్ రెడ్డి అన్నారు. కొల్లాపూర్ నియోజక వర్గంలోని పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో బీ ఆర్ ఎస్ నాయకులు నాగరాజు అధ్యక్షతన అయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తు యువత క్రీడలో రాణించేందుకు కెసిఆర్ స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ చేయటం జరిగింది. రాబోయే రోజుల్లో యువత క్రీడలో రాణించి జిల్లాకు రాష్టానికి మంచి



పేరు తేవాలని సూచించారు. దసరా పండుగ కనుక మహిళలందరికీ బతుకమ్మ చీరల పంపిణి చేపట్టినట్లు తెలిపారు. పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ భవనా లేక ఇన్ని రోజులు అద్దె భవనం లో కొనసాగాయి. బీ ఆర్ ఎస్ చేస్తున అభివృద్ధి చూసి ఓర్వలేక పోతున్నారు. ప్రజలు అన్ని గమనిస్తే ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమం లో ఎంపీటీసీ రేణుక. మాజీ జెడ్పీటీసీ వెంకటయ్య. మాజీ ఎంపీపీ వెంకటేశ్వర రావు. మైసమ్మ డైరెక్టర్ అశోక్ రెడ్డి. మాజీ సర్పంచ్ జక్కుల నరసింహా తదితరులు పాల్గొన్నారు.

# సిక్కిం వరదలు.. 14 మంది మృతి 102 మంది గల్లంతు

(మొదటిపేజీ తరువాయి)

(ఎన్‌డిఆర్ఎఫ్) నేతృత్వంలో ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపడుతున్నారు. భారత వైమానిక దళం కూడా సిద్ధంగా ఉందని అన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దాదాపు 3,000 మంది పర్యాటకులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో చిక్కుకుపోయినట్లు సిక్కిం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విబి పాఠక్ తెలిపారు. చుంగ్‌థాంగ్‌లోని తీస్తా స్టేజ్ 111 ఆనకట్టలో పనిచేస్తున్న పలువురు కార్మికులు కూడా ఆనకట్ట సొరంగాల్లోనే చిక్కుకుపోయినట్లు పేర్కొన్నారు. ఆకస్మిక వరదలతో తీస్తా నది బేసిన్‌లోని దిక్చు, సింగ్తమ్, రంగ్పో పట్టణాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు చోట్ల రహదారులు నీటమునిగాయి. పశ్చిమబెంగాల్, సిక్కింను కలిపే 10వ నంబర్ జాతీయ రహదారి చాలా చోట్ల దెబ్బతింది. వందలాది ఇళ్లు నేలమట్టమయ్యాయి. తీస్తా సిక్కిం నుండి బెంగాల్‌కు దిగువకు ప్రవహిస్తున్నందున రాష్ట్ర సరిహద్దు సమీపంలోని ఇళ్లలోకి బురద చేరింది. బెంగాల్ లోని కాలింపాంగ్ జిల్లాలో పలు చెట్లు నేల కూలాయి. నివాసాలు కొట్టుకుపోయాయి.

## బతుకమ్మ చీరల పంపిణీ



- బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న చైర్పర్సన్ చెవుల స్వప్న, వైస్ చైర్ పర్సన్ చాలా సంపూర్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

**అబ్దుల్లాపూర్ మెట్ – ప్రభాత సూర్యుడు :** పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధిలో చైర్ పర్సన్ చెవుల స్వప్న చిరంజీవి బతుకమ్మ చీరలు పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. పెద్ద అంబర్ పేట్ కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో బతుకమ్మ చీరలను వైస్ చైర్ పర్సన్ చామ సంపూర్ణ విజయ శేఖర్ రెడ్డి, కౌన్సిలర్లు వద్దేపల్లి విద్యావతి విజేందర్ రెడ్డి, బొర్ర అనురాధ సురేష్, పాశం అర్చన దామోదర్, పసుల రాజేందర్ లతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఎస్ రవీందర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## 66 మందిని బైండోవర్

- రాబోవు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ముందస్తు చర్యలు
- ఇన్స్పెక్టర్ ఏ.మన్మోహన్ యాదవ్



- ఇన్స్పెక్టర్ ఏ.మన్మోహన్

**అబ్దుల్లాపూర్ మెట్ – ప్రభాత సూర్యుడు :** వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని శాంతి భద్రతలకు భంగం కలిగే ప్రమాదం ఉన్నందున, ముందస్తు చర్యల్లో భాగంగా అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 66 మందిని బైండోవర్ చేసి మండల తహసిల్దార్,మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచినట్లు ఇన్స్పెక్టర్ ఏ.మన్మోహన్ యాదవ్ తెలిపారు. వీరు గతంలో పలు కేసులలో నిందితులుగా ఉన్నారని, శాంతి భద్రతలకు భంగం కలిగించకుండా, సత్ప్రవర్తనతో ఉండాలని ఉద్దేశంతో బైండోవర్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ వ్యక్తులు భవిష్యత్తులో మళ్లీ ఏవైనా నేరాలు చేసినట్లయితే లక్ష రూపాయల జరిమానా విధిస్తామని, అవసరమైతే సస్పెక్టెడ్, పీడీ యాక్ట్ కేసులను కూడా పెట్టేందుకు వెనుకాడమని హెచ్చరించారు.

## అభివృద్ధి పనులపై ఉప ముఖ్యమంత్రితో ప్రజా ప్రతినిధులు భేటీ



**తాడేపల్లిగూడెం – ప్రభాత సూర్యుడు :** తాడేపల్లిగూడెం క్యాంప్ కార్యాలయంలో ఉప ముఖ్య మంత్రి కొట్టు సత్య నారాయణ నుజడ్పిటిసి ముత్యాల ఆంజనేయులు, మండల జెసిఎస్ కన్వీనర్ ముప్పిడి సంపత్ కుమార్, మండల మహిళా ప్రెసిడెంట్ నూనె రాధ, నీలాద్రిపురం ఎంపీటీసీ మట్టా సత్యనారాయణ, మెట్ట ఉప్పరగూడెం ఎంపీటీసీ కట్టా రంగబాబులు గురువారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి (దేవాదాయ ధర్మాదాయ శాఖ) కొట్టు సత్యనారాయణ ను ప్రత్యేకంగా కలిసారు. ఈ సందర్భంగా నీలాద్రిపురం గ్రామం అభివృద్ధి పనులపై మంత్రి కొట్టు జడ్పిటిసి ఆంజనేయులు, ఎంపీటీసీ మట్టా సత్యనారాయణతో సమీక్షించారు. గ్రామంలో 20 లక్షల రూపాయలతో సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మాణం చేపడుతున్నట్లు మంత్రి కొట్టు వారికి తెలియజేశారు. పనులు నాణ్యతతో జరిగేలా పర్యవేక్షించాలని వారికి సూచించారు. ఈ సందర్భంగా నీలాద్రిపురం పంచాయతీ పరిధిలోని నీలాద్రిపురం తో పాటు కృష్ణాపురం గ్రామాలలో పార్టీ పటిష్టతకు గట్టిగా కృషి చేయాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో ఈ రెండు గ్రామాలలోనూ వైకాపాకు కచ్చితంగా ఆధిక్యత సాధించాలని దిశా నిర్దేశం చేశారు.

## తుది ఓటర్ జాబితా విడుదల

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

**పెద్దపల్లి – ప్రభాత సూర్యుడు :** జిల్లాలో తుది ఓటర్ల జాబితా విడుదల చేశామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. జిల్లాలో మంథని, రామగుండం, పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో తుది ఓటరు జాబితా విడుదల చేశామని, జిల్లా వ్యాప్తంగా 3 లక్షల 45 వేల 829 మంది పురుషులు, 3 లక్షల 48 వేల 729 మంది మహిళలు, 54 ఇతర జెండర్, మొత్తం 6 లక్షల 94 వేల 612 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. పెద్దపల్లి నియోజకవర్గం పరిధిలో లక్షా 23 వేల 768 మంది పురుషులు, లక్షా 25 వేల 555 మంది మహిళలు, 9 ఇతర జెండర్, మొత్తం 2 లక్షల 49 వేల 332 మంది ఓటర్లు, రామగుం డం నియోజకవర్గం పరిధిలో లక్షా 8 వేల 233 మంది పురుషులు, లక్షా 6 వేల 716 మంది మహిళలు, 25 ఇతర జెండర్, మొత్తం 2 లక్షల 14 వేల 974 మంది ఓటర్లు, మంథని నియోజకవర్గం పరిధిలో లక్షా 13 వేల 828 మంది పురుషులు, లక్షా 16 వేల 458 మంది మహిళలు, 20 ఇతర జెండర్, మొత్తం 2 లక్షల 30 వేల 306 మంది ఓటర్లు తుది జాబితాలో ఉన్నారని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# అభివృద్ధి, సంక్షేమాలకు పెద్దపీట

- 9.50 కోట్లతో అభివృద్ధి పనుల ప్రారంభం
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి



- ఐదవ వార్డులో పట్టణ ప్రకృతి వనము, కమ్యూనిటీ హాల్ భవనాన్ని ప్రారంభిస్తున్న కిషన్ రెడ్డి



- సిసి రోడ్డు నిర్మాణ పనులకు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

**అబ్దుల్లాపూర్ మెట్ – ప్రభాత సూర్యుడు :** గడచిన తొమ్మిదిన్నర సంవత్సరాల కాలంలో అభివృద్ధి సంక్షేమాలకు పెద్దపీట వేశామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధిలో పలు వార్డులలో 9.50 కోట్ల రూపాయల నిధులతో పట్టణ ప్రగతి వనము, కమ్యూనిటీ హాల్ భవనము, సిసి రోడ్లు, వరద నీటి కాలువల అభివృద్ధి పనులను గురువారం మున్సిపల్ చైర్ పర్సన్ చెవుల స్వప్న చిరంజీవిలతో కలిసి మంచిరెడ్డి కిషన్ రెడ్డి శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని మున్సిపాలిటీలన్నింటినీ పెద్ద మొత్తంలో నిధులు కేటాయిస్తూ అన్ని రకాల మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ చామ సంపూర్ణ విజయ శేఖర్ రెడ్డి, కౌన్సిలర్లు బొర్ర అనురాధ సురేష్, పండుగల జయశ్రీ రాజు, వద్దేపల్లి విద్యావతి విజేందర్ రెడ్డి, పాశం అర్చన దామోదర్, మోతే మన్నెమ్మ రామలింగం, కందాడ అనుపమ సుప్రసేనారెడ్డి, తొండాపు రోహిణి బ్రహ్మానంద రెడ్డి, పసుల రాజేందర్, చల్లూరి మురళీధర్ రెడ్డి, సిద్దెంకి కృష్ణారెడ్డి, చెవుల హరిశంకర్, గారాల శ్రీనివాస్ గౌడ్, మున్సిపాలిటీ బిఆర్ఎస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు చెరుకూరి రేణుక జగన్, గౌని భాస్కర్ గౌడ్, దేవిడి విజయ భాస్కర్ రెడ్డి, పాలడుగు నాగార్జున మరియు మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి, డిఈఈ అశోక్ కుమార్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికులకు దసరా కానుక

- రూ.711.18 కోట్ల లాభాల బోనస్
- ముఖ్యమంత్రికేసీఆర్ ఆదేశం తో నిధుల విడుదల
- ఈ నెల 16 న ఉద్యోగుల బాంక్ ఖాతాల్లో జమ
- ప్రకటించిన సంస్థ సి అండ్ ఎండి ఎన్.శ్రీధర్



**భద్రాద్రి కొత్తగూడెం – ప్రభాత సూర్యుడు :** సింగరేణి కార్మికులకు దసరా కానుకగా లాభాల వాటా బోనస్ రూ.711.18 కోట్లను ఈ నెల 16 వ తేదీన చెల్లించనున్నట్లు సంస్థ ఛైర్మన్ ఎండీ ఎన్.శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఇటీవల ప్రకటించిన విదంగా గత ఏడాది సింగరేణి సాధించిన రూ.2222.46 కోట్ల రూపాయల లో 32 శాతం లాభాల బోనసును దసరా పండుగకు వారం రోజుల ముందే చెల్లిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. సగటున ఒక్కో ఉద్యోగికి రూ. ఒక లక్ష 53 వేల రూపాయల వరకు లాభాల బోనస్ అందనుందని ఆయన తెలిపారు .సింగరేణి సంస్థను లాభాల దిశగా నడిపిస్తున్న కార్మికులకు గతంలో కన్న ఎక్కువ శాతాన్ని లాభాల వాటా ప్రకటించిన రాష్ట్ర ముఖ్య మంత్రి కె.చంద్ర శేఖరరావు కు సింగరేణి ఉద్యోగుల తరఫున ఛైర్మన్ తన కృతజ్ఞతలు తెలిపారు. బోనస్ చెల్లింపుపై డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ పర్సనల్ ఎన్. బలరామ్ గురువారం సర్క్యులర్ ను జారీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి...దేశంలో మరే ఇతర బొగ్గు కంపెనీ లో లేని విధంగా సింగరేణి సంస్థ ప్రతి ఏడాది తనకు వచ్చిన నికర లాభాల్లో కొంత శాతం వాటాను లాభాల బోనస్‌గా కార్మికులకు పంచడం జరుగుతుంది. కాగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు గతంలో కన్నా ఎక్కువ శాతం లాభాల వాటా బోనస్ ను ప్రకటిస్తూ వస్తున్నారు. తెలంగాణ రాకపూర్వం 2013 -14లో ఇది 20 శాతం ఉండగా, తెలంగాణ ఆవిర్భావం తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి దీనిని పెంచుతూ 2014-15 లో 21 శాతం, 2015-16లో 23 శాతం (245.21 కోట్లు) 2016-17లో 25 శాతం (98.85 కోట్లు), 2017-18 లో27 శాతం (327.44 కోట్లు), 2018 19 లో 28 శాతం (493.82 కోట్లు), 2020-21 లో29 శాతం (79.07 కోట్లు), 2021-22లో 30 శాతం (368.11 కోట్లు) ప్రకటించారు. గత ఆర్థిక సంవత్సరం అనగా 2022-23 సింగరేణి సంస్థ సాధించిన నికర లాభాలు 2222 కోట్ల రూపాయలలో 32 శాతం అనగా రూ.711.18 కోట్ల ను లాభాల బోనస్‌గా కార్మికులకు చెల్లించాలని ఇటీవలే ఆదేశించారు. అలాగే దసరా పండుగకు ముందే ఇది కార్మికుల చేతికి అందేలా చూడాలని ఇటీవల యాజమాన్యాన్ని ఆదేశించారు. ఈ మేరకు సింగరేణి యాజమాన్యం పూర్తి ఏర్పాట్లను చేసింది.ఎక్కువ హాజరు ఉన్నవారికి ఎక్కువ లాభంగత ఆర్థిక సంవత్సరంలో విధులు నిర్వహించిన 46,326 మంది సింగరేణి ఉద్యోగులకు 32 శాతం వాటాగా కేటాయించిన రూ.711.18 కోట్ల రూపాయలను వారు పనిచేస్తున్న గని మరియు శాఖ ఆధారంగా లాభాల బోనస్ ను లెక్కించి చెల్లించనున్నారు. ప్రధానంగా ఎక్కువ హాజరు ఉన్నవారికి ఎక్కువ మొత్తంలో లాభాల బోనస్ దక్కనుంది.భూగర్భ గని ఉద్యోగులకు రోజుకు 749.58 రూపాయల చొప్పున వారు పని చేసిన మొత్తం దినాలకు లెక్కగట్టి లాభాల బోనస్ చెల్లిస్తారు.ఓపెన్ కాస్ట్ గనులు , ఇతర సర్ఫేస్ శాఖల్లో పనిచేసే వారికి రూ.627.41 చొప్పున చెల్లిస్తారు. వీరు కాక మిగిలిన విభాగాలు, శాఖల్లో పనిచేసే వారికి రోజుకు రూ.578.69 ల చొప్పున వారు పనిచేసిన దినాలకు లెక్క కట్టి బోనస్ చెల్లిస్తారు.మొత్తం మీద చూస్తే సగటున ఒక్కో కార్మికునికి రూ 1,53,516 వరకు లాభాల బోనస్ పొందే అవకాశం ఉంది.తెలంగాణ వచ్చాకనే అత్యధిక టర్నోవర్ మరియు లాభాలు:తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకు అందిస్తున్న సహకారం, రాష్ట్ర ముఖ్యమంత్రి దిశా నిర్దేశంలో సింగరేణి సంస్థ గత తొమ్మిదేళ్ల కాలంలో అద్భుతమైన ప్రగతిని సాధించింది. సంస్థ ఛైర్మెన్ మరియు ఎండి శ్రీ ఎన్.శ్రీధర్ సమర్థ సారథ్యం, ఉద్యోగుల సమష్టి కృషి ఫలితంగా తెలంగాణ రాకపూర్వంతో పోలిస్తే లాభాల్లో 421 శాతం వృద్ధినీ, అమ్మ కాలలో 176 శాతం వృద్ధిని సాధించింది. తెలంగాణ రాకపూర్వం 2013-14 లో రూ.11,928 కోట్ల టర్నోవర్ సాధించిన సింగరేణి, గత తొమ్మిదేళ్లలో ప్రతి ఏటా వృద్ధి చెందుతూ 2022-23లో రూ.33,065 కోట్ల రూపాయల టర్నోవర్ కు ఎదిగింది. అలాగే నాడు రూ.419 కోట్ల లాభాలను సాధించిన సంస్థ నేడు రూ.2222 కోట్ల రూపాయల లాభాల ను ఆర్జించగలిగింది.త్వరలో దీపావళి బోనస్ కూడాఇదిలా ఉంటే దీపావళి బోనస్ గా పేర్కొనే (ప్రొడక్షన్ లింక్డ్ రివార్డ్ స్కీమ్ బోనస్ ను) కూడా ఆ పండుగకు ముందే చెల్లించనున్నట్లు ఛైర్మన్ మరియు ఎండి శ్రీ ఎన్.శ్రీధర్ ప్రకటించారు. ఇది కూడా సుమారు 300 కోట్ల వరకు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. సగటున ఒక్కో కార్మికుడికి గత ఏడాది చెల్లించిన 76,500 కన్నా ఇంకా ఎక్కువ పొందే అవకాశాలు ఉన్నాయి.ఇటీవలనే చెల్లించిన 11వ వేజ్ బోర్డు ఎరియర్స్ 1450 కోట్ల రూపాయలలో సగటున ఒక్కో కార్మికునికి 3.65 లక్ష రూపాయల వరకు అందాయి.ఈ విధంగా వేజ్ బోర్డు ఎరియర్స్, లాభాల బోనస్, దీపావళి బోనస్‌లు కలిపితే సగటున ప్రతి కార్మికుడి ఖాతాలో దాదాపు 6 లక్షల రూపాయల వరకు జమ అయ్యే అవకాశం ఉంది. ఒక ఏడాదిలో ఇంత పెద్ద మొత్తంలో తమ కష్టార్జితం చేతికందడం ఇదే ప్రథమం కనుక దీనిని వృథా చేసుకోకుండా భవిష్యత్తు అవసరాలకు దాచుకోవాలని, సద్వినియోగం చేసుకోవాలని యాజమాన్యం విజ్ఞప్తి చేసింది.ఈ ఏడాది లక్ష్యాలు సాధిస్తే రూ3500 కోట్ల లాభాలు సిఅండ్ ఎండి శ్రీ ఎన్.శ్రీధర్‌బాగా పనిచేసిన కారణం గానే అద్భుతమైన వృద్ధి సాధ్యమైందని, కనుకనే సింగరేణి చరిత్రలో అత్యధిక శాతం లాభాల వాటాను కార్మికులు అందుకోగలిగారని సంస్థ ఛైర్మెన్ శ్రీ ఎన్.శ్రీధర్ పేర్కొన్నారు. ఈ ఏడాదికి నిర్దేశించుకున్న వార్షిక ఉత్పత్తి లక్ష్యం 720 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణాను సాధించగలిగితే సింగరేణి సంస్థ గత ఏడాది కన్నా మిన్నగా 3500 కోట్ల లాభాలను సాధించే అవకాశం ఉందని, ఫలితంగా మరింత సంక్షేమంతో పాటు. ఇప్పటికన్నా ఎక్కువ లాభాల వాటా బోనస్‌ను పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. కనుక ప్రతి కార్మికుడు తన పనిగంటలను, యంత్రాల పనిగంటలను పూర్తిస్థాయిలో వినియోగిస్తూ ఉత్పాదకత, ఉత్పత్తి పెంచాలని ఆయన పిలుపునిచ్చారు.

## నల్ల వెంటే మా ప్రయాణం :పెద్దపల్లి పట్టణ ప్రజలు


**పెద్దపల్లి – – ప్రభాత సూర్యుడు :** నల్ల మనోహర్ రెడ్డి వెంటే తమ ప్రయాణం సాగుతుందని పట్టణ ప్రజలు ముక్త కంఠంతో పిలుపు నిచ్చారు. పెద్దపల్లి పట్టణ 31వ వార్డు ప్రజలు ఇటీవల ఃఖీా పార్టీ టికెట్ వ్యవహారంలో అసంతృప్తి గా ఉన్న నల్ల మనోహర్ రెడ్డిని తమ వార్డుకి స్వచ్ఛందంగా ఆహ్వానించి ఘన స్వాగతం పలికారు. రాబోయే ఎన్నికల్లో బరిలో ఉండాలని ఏ పార్టీ నుండి పోటీ చేసిన తామంత నల్ల వెంటే ఉండి భారీ మెజారిటీతో గెలిపించుకుంటామంటూ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నల్ల మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలలో ఉన్న చైతన్యానికి తను సర్వదా రుణపడి ఉంటానని తప్పకుండ రాబోయే రోజుల్లో మీ అందరి సహాయ సహకారలతో ఎన్నికల బరిలో ఉంటానని మీకు ఎలాంటి కష్టం వచ్చిన ఆపద వచ్చిన చేదోడు వాదోడుగా ఉంటానని హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో ప్రజలు మంచికి ఓటు వేయాలని మీరు నాకు ఇచ్చే స్ఫూర్తి, భరోసా వృధా కాకుండా ఒక మంచి వ్యవహార శైలితో 24 గంటలు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ముందుకు పోతానని తెలిపారు. అలాగే మిగితా నాయకులు ఒక్క ఎన్నికల సమయంలో మాత్రమే వాళ్ల స్వార్థ రాజకీయల కోసం ఓట్ల అడగడానికి వస్తారని రాబోయే ఎన్నికల్లో మీరంతా కూడా మంచికి ఓటు వేసి వారందరికీ తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలు, మహిళలు, యువకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## దంపతుల ఆత్మహత్య

**అశ్వారావుపేట – ప్రభాత సూర్యుడు :** దంపతులు ఆత్మహత్య చేసుకున్న సంఘటన అశ్వరావుపేట పట్టణంలో చోటుచేసుకుంది.అశ్వరావుపేట పట్టణంలోని మద్దిరావమ్మ గుడి సమీపంలో నివాసం ఉంటున్న ఎర్రం కృష్ణ , ఎర్రం రమ్యలు ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు.బంధువులు ఇంటికి వచ్చేసరికి తలుపులు తీయకపోవటంతో తలుపులు పగలగొట్టి చూడగా ఇంట్లో ఇద్దరూ విగత జీవులుగా కనిపించారు. స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

## పట్టణాల్లో,గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తా

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్



**సూర్యాపేట – ప్రభాత సూర్యుడు :** కోదాడ పట్టణాని సర్వాంగ సుందరంగా మారుస్తా అని కోదాడ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. కోదాడ పట్టణంలోని 35,14, 18 వార్డులో కోట్ల రూపాయలతో చేపడుతున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ శంకుస్థాపన చేశారు. అనంతరం 100 కె.వి ట్రాన్స్ఫారంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల,పట్టణాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుంది అని ఆయన అన్నారు. పట్టణాల్లో, గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తా అని ఆయన తెలిపారు.రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందజేస్తున్న రైతు బంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత విద్యుత్ పథకాల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించాలని కోరారు. పేదింటి అడబిడ్డల పెండ్లి కోసం కల్యాలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా ప్రభుత్వం రూ.1,00,116 ఆర్థిక సాయం అందజేస్తున్నదని అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలను పెంచేందుకు కేసీఆర్ కిట్స్ అందజేస్తున్నదని అన్నారు. ప్రతీ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపర్చి మౌలికవసతుల కల్పనకు పెద్దపీట వేస్తోందని అన్నారు. నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తున్నదని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వార్డు కౌన్సిలర్లు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215